సాక్షి నిర్మల్

శనివారం । 23 । నవంబర్ । 2024

ఆమెకు 'భరోసా'..

మహిళలు, పిల్లల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. లైంగిక వేధింపులు, దాడులకు గురైనవారికి అండగా నిలిచేందుకు ప్రారంభించిన భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

- వివరాలు 8లో▸



న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కేంద్రం తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరీక్షల అధికారి పద్మ

భైంసాటౌన్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష కేంద్రాన్ని పరీక్షల నియంత్రణ అధికారి పద్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఏర్పాట్లపై హెచ్‌ఎం గంగాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి వారికి తొమ్మిది నుంచి ఇంటర్ వరకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఈనెల 24న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 963 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె నోటీసు



డీఈవోకు నోటీసు అందిస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలని జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టర్ ఏవో, డీఈవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను 15 రోజుల్లోగా నెరవేర్చాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తామన్నారు. ఇందులో ప్రధాన కార్యదర్శి రత్నం, గజేంద్రసింగ్, సుధాకర్, హరీశ్, స్పందన, కావ్య, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

నిర్మల్ టౌన్: ఈ నెల 21న మంచిర్యాల్ ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి అండర్–14, 17 బాల, బాలికల బాక్సింగ్ పోటీల్లో నిర్మల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. జిల్లా నుంచి 23 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 9 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు సాధించారు. బాలికల విభాగంలో ఎ.నికిత (44–46 కేజీలు), ఎస్.వనజ(57–60 కేజీలు), బి.శ్రావణి (63–66 కేజీలు), అభినయ(50–52కేజీలు), ఎస్.అక్షయ (54–57 కేజీలు), ఆడెల్ల(60–63 కేజీలు), సీహెచ్.నక్షత్ర(75–80 కేజీలు), పి.అభినయ(50–52 కేజీలు), ఎం.రమ్యశ్రీ(45–48కేజీలు) పతకాలు సాధించారు. బాలుర విభాగంలో కౌశల్‌రెడ్డి, శౌర్యన్‌రెడ్డి పతకాలు సాధించారు. జిల్లా బాక్సింగ్ సెక్రెటరీ చందులస్వామి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

3లోపు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ రూరల్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు(లోయర్, హయ్యర్ గ్రేడ్), టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షల కోసం వచ్చేనెల 3లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రామారావు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారాపూర్తి చేసి, డీఈవో కార్యాలయంలో డిసెబర్ 3వ తేదీలోపు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, దరఖాస్తు పూర్తి వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

భైంసాలో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు


భైంసాటౌన్: పట్టణంలోని పలు బేకరీలు, కన్ఫెక్షనరీ దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి ప్రత్యూష శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. లేబుల్, తయారీ, గడువు తేదీ లేని ఉత్పత్తులను గుర్తించారు. వాటిని విక్రయిస్తున్న షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మరోమారు ఇలాంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'అన్నా.. రెండు రోజులుగా ఒళ్లు నొప్పులు పెయిన్ కిల్లర్ ట్లాబెట్ ఇవ్వడి'.. నిర్మల్ పట్టణానికి చెందిన ఓ యువకుడు మందుల షాప్‌కువెళ్లి అడిగాడు. వెంటనే సదరు షాపు నిర్వాహకుడు నాలుగు పెయిన్ కిల్లర్స్ ఇచ్చాడు. ఉదయం, సాయంత్రం రెండు రోజులు తిన్న తర్వాత వేసుకో అని సూచించాడు. దీంతో వాటిని తీసుకుని వెళ్లాడు.

'ఏమండీ.. పాపకు దగ్గు ఎక్కువైంది.. వచ్చేటప్పుడు మెడికల్ షాప్‌లో సిరప్ తీసుకురండి' ఆఫీసులో ఉన్న భర్తకు ఫోన్ చేసింది భార్య. దీంతో అతను ఇంటికి వెళ్లేటప్పుడు భైంసాలోని ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. పాపకు దగ్గు ఉందని సిరప్ కావాలని అడిగాడు. షాప్ నిర్వాహకుడు పాప వయసు అడిగి ఓ సిరప్ ఇచ్చి పంపించాడు.

'చాలా రోజులుగా జలుబు తగ్గడం లేదురా అని ఓ వ్యక్తి పని స్థలంలో తన మిత్రుడికి చెప్పాడు. దీంతో మందులపై కాస్త పరిజ్ఞానం ఉన్న అతడు.. నిర్మల్‌లోని ఫలానా మెడిక్ షాపుకు వెళ్లి.. ఫలానా ట్యాబ్లెట్ తీసుకో. రెండు పూటలు వాడితే చాలు జలుబు మాయం అవుతుంది. ఫ్రీగా అనిపిస్తుంది అని చెప్పాడు.

ఓవర్ డోస్!





నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో అందరూ డాక్టర్ అయిపోతున్నారు. సొంతంగా మందులు వాడేవారు రోజురోజుకు పెరిగిపోతున్నారు. చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లలేక.. అలాగని ప్రైవేటు వైద్యుల వద్దకు వెళితే ఖర్చు అధికం అవుతుందని నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి మందులు తెచ్చుకుని వేసుకుంటున్నారు. వైద్యుల సలహాలు, సూచనలు లేకుండా సొంతంగా మందులు వినియోగం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు.

సొంత వైద్యం...

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుందో లేదో అన్న అనుమానం.. ప్రైవేటుగా వెళ్తే భరించలేని ఫీజులు, అనవసర పరీక్షలు.. దీంతో చాలా మంది చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు సొంత వైద్యం చేసుకుంటున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ముందు మెడికల్ షాపులకే వెళ్తున్నారు. అనారోగ్య లక్షణాలు చెప్పగానే మెడికల్ షాపుల నిర్వాహకులు మందులు ఇచ్చి పంపుతున్నారు. అయితే కొన్నిసార్లు మందులు వికటిస్తున్నాయి. ఓవర్ డోస్‌తో అస్వస్థతకు గురవుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే మోతాదుకు మించి మందుల వాడక, ఇష్టానుసారంగా యాంటిబయాటిక్స్ వాడకంలో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకు కేంద్రం ఏఎంఆర్(యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్) అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోంది.

డబ్ల్యూహెచ్‌వో ఆంక్షలు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటిబయాటిక్స్ వినియోగంపై ఆంక్షలు విధించింది. తక్కువగా వినియోగించాలని, అత్యవసరమైతే నిర్ణీత మోతాదులో వాడాలని సూచనలు చేసింది. ఇన్ఫెక్షన్ బారిన పడిన కొందరు వైద్యులు సూచించిన మందులతోపాటు యాంటిబయాటిక్స్ కొనుగోలు చేస్తారు. వైద్యులు మాత్రం ఆ రోగికి ఏ మేరకు అవసరమో అంతే రాసిస్తారు. ఆ కోర్సును బాధితులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కొందరికి రెండు మూడు రోజుల్లో తగ్గిపోతే వాడటం మానేస్తుంటారు. కొందరు వైద్యులు రాసిన చీటీపై మళ్లీ తీసుకెళ్లి కొనుగోలు చేసి మోతాదుకు మించి వాడేస్తున్నారు. ఇలా చేయడంతో శరీరంలోని బ్యాక్టీరియా, వైరస్ ఆ మందులకు లొంగకపోగా, రూపాంతరం చెందుతుంది. మళ్లీ అదే ఇన్ఫెక్షన్ బారిన పడితే ఆ మందులు పని చేయవు. అప్పుడు ప్రాణాంతకంగా మారే అవకాశముంది.

అవగాహన కార్యక్రమాలు..

భవిష్యత్ తరాలను యాంటిబయాటిక్స్ నుంచి రక్షించే ఉద్దేశంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వాటి వాడకంపై నవంబర్ 18 నుంచి 24 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వారం రోజులపాటు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 18న వైద్యులు, వైద్య సిబ్బందితో యాంటిబయాటిక్స్ తక్కువగా సరైన విధానంలో వాడటం గురించి అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం పీహెచ్‌సీల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు, 21న పోస్టర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు, 22న రైతులు, పశువుల కాపర్లు, కార్మికులకు అవగాహన కార్యక్రమాలు, 23న విద్యార్థులకు వ్యాసరచన పోటీలను, 24న ర్యాలీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

వైద్యుల సలహా మేరకే..



అనవసరంగా అధిక మోతాదులో యాంటీ బయాటిక్ వాడకూడదు. క్వాలిఫైడ్ డాక్టర్స్ సూచన మేరకే మందులు వాడాలి. అధిక మోతాదులో వాడడం వల్ల ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. జిల్లాలో ఆయా సీహెచ్‌సీల పరిధిలో ఈనెల 24 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ రాజేందర్, డీఎంహెచ్‌వో

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు



జెండా ఊపి దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతిభకు వైకల్యం అడ్డు కాదని నిరూపించారు దివ్యాంగులు. తమలో దాగున్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అందరి ప్రశంసలు పొందారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మహిళా, శిశు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో దివ్యాంగులకు శుక్రవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జి డీడబ్ల్యూవో, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. పరుగు పందెం, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, జావెలిన్‌త్రో, వీల్‌చైర్, ట్రైసైకిల్ పందెం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించామన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని త్వరలో హైదరాబాదులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, అధికారులు దివ్యాంగులు పాల్గొన్నారు.



వీల్ చైర్ పోటీల్లో దివ్యాంగులు

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

• జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

సారంగపూర్: ప్రతీరోజు గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర సర్వే వివరాలను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి రకు ఎన్ని కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లు చేపట్టిన సర్వే ఫారాలు ఏఒక్కటి మిస్సవ్వకుండా అన్నింటినీ పరిశీలించిన తర్వాత ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను, అలాగే నర్సరీ పనులను గురించి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీదేవి, మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, ఆపరేటర్లు ఉన్నారు.



ఆపరేటర్లకు సూచనలు, సలహాలు ఇస్తున్న డీపీవో శ్రీనివాస్

నానో యూరియాతో లాభాలు

నిర్మల్‌చైన్‌గేట్: నానో యూరియాతో అనేక లాభాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇఫ్కో ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని డీలర్స్‌తో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నానో యూరియా ఉత్పత్తి, ఆదాయాన్ని పెంచుతూ నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇఫ్కో తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ మేనేజర్ కపాశంకర్ రైతులు నానో యూరియా ప్లస్, నానో డీఏపీ వాడితే కలిగే లాభాలను వివరించారు. ఇఫ్కో రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇఫ్కో ద్వారా రైతులకు సబ్సిడీపై డ్రోన్‌తో స్ప్రే చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు వసంత్‌రావు, నాగరాజు, ఇఫ్కో జిల్లా మేనేజర్ బాలవికాస్, ఉమ్మడి జిల్లా డీలర్లు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్, మ్యాక్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్

సమస్యల పరిష్కారానికే వేదిక

• సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ



ఫిర్యాదు స్వీకరిస్తున్న చైర్మన్ నారాయణ

లక్ష్మణచాంద: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే వేదిక ఏర్పాటు చేశామని సీజీఆర్‌ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్స్ రీగ్రెసివ్ ఫోరం)చైర్మన్ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో నిర్మల్ రూరల్ సబ్ డివిజనల్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయని ఇందులో ఒకటి ఆర్థిక పరమైన సమస్యలు కాగా, రెండోది ఆర్థికపరమైనవి కాని సమస్యలు ఉంటాయన్నారు. ఆర్థికపరం కానీ సమస్యలను తమ దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కాస్త ఆలస్యం అవుతుందని తెలిపారు. సిటిజన్ చార్ట్ ప్రకారం విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలు ఉంటే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సొంతంగా మరమ్మతులు చేపట్టొద్దని సూచించారు. రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలంబాట కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేదికలో 10 మంది విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేశారు. నాలుగు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ టెక్నికల్ సభ్యుడు రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యుడు కిషన్, డీఈ నాగరాజు, ఏడీఈ వెంకటపతిరాజు, వివిధ మండలాల ఏఈలు మహేశ్, సాయికిరణ్, రాజేందర్, శంకర్ విద్యుత్ సిబ్బంది, వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఆంక్షల నడుమ అమ్మవారి దర్శనం

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీ పరిసర ప్రాంతంలో రైతు వెంకట్రాంరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల నిర్మించిన దుర్గాదేవి ఆలయానికి గుండంపల్లి గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం కాలినడకన వచ్చారు. మొదట పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము భక్తి భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్తున్నామన్నా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులు భారీగా చేరుకుని తమ గ్రామానికి చెందిన మహిళా భక్తులు అమ్మవారి దర్శనానికి మాత్రమే వెళ్తున్నారని, తమకు ఎలాంటి ఇబ్బంది కలుగనివ్వరని హామీ ఇవ్వడంతో బందోబస్తు మధ్య మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ గ్రామ పరిసరాల్లో స్వేచ్ఛగా తిరగకుండా పోలీసులు ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో తాము తిరగడానికి ఆంక్షలు ఎందుకని ప్రశ్నించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి కొమ్ముకాస్తూ తమను పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.



పోలీసు బందోబస్తుతో గుడికి వెళ్తున్న మహిళలు

హైరిస్క్ గర్భిణులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గర్భస్థ శిశు మరణాలపై వైద్య శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ మహిళల మరణాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే గర్భిణుల మరణాలు నియంత్రించేందుకు హై పవర్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఏఎన్‌ఎం, ఆశ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు హైరిస్కు గర్భిణుల గుర్తింపు, గర్భస్థ మరణాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై వారానికి కొందరు వైద్యులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైరిస్క్ గర్భిణులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లాలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హెల్ప్ లైన్ కేంద్రాల ద్వారా నలుగురు ఏఎన్‌ఎం, సిబ్బంది గుర్తించిన హైరిస్క్ గర్భిణులకు ఫోన్లు చేసి, వారి ఆరోగ్యస్థితి తెలుసుకుని, వారికి అవసరమగు వైద్య సేవల వివరాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైరిస్క్ గర్భిణులకు సంబంధించిన వివరాలు, వారి స్థితిగతుల సమాచారాన్ని తెలుసుకోవడానికి నెలవారీగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గర్భిణుల్లో హృదయ సంబంధ సమస్యలు గుర్తిస్తే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో టూడీ ఎకో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సంబంధిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యులు సురేశ్, శ్రీనివాస్, సౌమ్య, అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి

పట్టణ ప్రాంతాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ పరిధిలోని పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయానికి పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలన్నారు. అన్ని రకాల వ్యాపారాలకు సంబంధించి వాణిజ్య లైసెన్సులు మంజూరు చేయాలని సూచించారు. ప్రతి వ్యాపారి లైసెన్సు పొందేలా అవగాహన కల్పించాలన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు సమాచారం అందితే వెంటనే ఆక్రమణలు తొలగించి భూములను రక్షించాలన్నారు. మెప్మా పరిధిలోని అన్ని పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నర్సరీలలో మొక్కలు పెంచేందుకు విత్తన టెండర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేశ్‌కుమార్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోవాలి

• కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానవంతులు కావాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం సందర్శించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. సమస్యలు, కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాంద్ అలీ, తాహసీల్దార్ రాజు, అధికారులు మోహన్‌సింగ్, విజయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

క్లుప్తంగా

చంపుతానని బెదిరించిన మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కందిమళ్ల ఆదినారాయణకు చెందిన భూమిలో కూలీ పనులు నిర్వహిస్తున్న తమను చంపుతానని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెదిరించినట్లు బట్వాన్‌పల్లికి చెందిన రామటెంకి శరణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం చిన్నయ్య, అతని డ్రైవర్ కృష్ణ, గన్‌మెన్‌లు కూలీ పనులు చేస్తున్న తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. నా భూమిలో మీరేం చేస్తున్నారు, ఇక్కడి నుంచి వెళ్లకపోతే చంపుతామని బెదిరించినట్లు శరణ్య తాళ్లగురిజాల స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై రమేశ్ వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేసి కేసు నమోదు అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్/వాంకిడి: యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్‌కు చెందిన నగోషె వినేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను లొంగదీసుకుని పలుమార్లు లైంగికదాడి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి కుటుంబసభ్యులు వినేష్‌ను అడగగా నిరాకరించాడు. సదరు యువతి 2021 నవంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈమేరకు తీర్పునిచ్చారు. నేరస్తుడు వినేష్‌కు శిక్షపడేలా చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డివి. శ్రీనివాస్‌రావు అభినందించారు.

పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

మంచిర్యాలక్రైం: ఒక ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి మరో రెండు బైకులు దగ్ధమైంది. జిల్లా కేంద్రంలోని చింతపండువాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పని నాగరాజు ఇంటి ఎదుట వేరే వ్యక్తులు ఐదు బైక్‌లు రోజులాగా గురువారం రాత్రి పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి శబ్దం వచ్చింది. పక్కనే ఉన్న మరో రెండు బైక్‌లకు మంటలు అంటుకున్నాయి. నాగరాజు వెంటనే అప్రమత్తమై మరో రెండు బైక్‌లను అక్కడి నుంచి తొలగించాడు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు.

పెంచికల్‌పేట్‌లో వైల్డ్ డాగ్స్



పెంచికల్‌పేట్: జిల్లాలో అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్ శునకాలు ప్రత్యక్షమయ్యాయి. మండలంలోని మురళిగూడ అటవీ ప్రాంతంలోని చెరువు వద్ద శుక్రవారం మూడు ఇండియన్ వైల్డ్ డాగ్స్ నీరు తాగుతుండగా యువకులు కెమెరాలో బంధించారు. పెంచికల్‌పేట్ అటవీరేంజ్ పరిధిలో 10 వరకు ఏషియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని అధికారులు తెలిపారు.

ఆమెకు భరోసా..



- అభాగ్యులకు అండగా నిలుస్తూ..
- కౌన్సెలింగ్ చేస్తూ.. న్యాయ సహాయం అందిస్తూ..
- 52 జంటలను కలిపిన నిర్మల్ కేంద్రం



కౌన్సెలింగ్‌తో కలిసిన కుటుంబాలతో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు, పిల్లల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. లైంగిక వేధింపులు, దాడులకు గురైనవారికి అండగా నిలిచేందుకు ఇంటిగ్రేటెడ్ సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్(భరోసా) కేంద్రాలను నెలకొల్పింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా గత ఫిబ్రవరి 18న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, ఎస్పీ జానకీ షర్మిల ప్రారంభించారు. పోలీస్ శాఖ పర్యవేక్షణలో ఈ కేంద్రం నడుస్తోంది. అభాగ్యులు, బాధిత మహిళలు, బాలికలు, ఆపదలో ఉన్నవారికి తక్షణమే ప్రత్యేక సేవలు, న్యాయసహాయం లభిస్తోంది. సఖీ కేంద్రంలో బాధితులకు పునరావాసం కల్పిస్తోంది. ఇప్పటివరకు భరోసా ద్వారా ఏకమైన 52 జంటలను శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు కుటుంబ సభ్యులు, వారితో కలిసి ఎస్పీ స్వయంగా భోజనం చేశారు.

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్మల్ పోలీస్..మీ పోలీసు అంటూ.. జానకీషర్మిల ప్రజలకు మరింత దగ్గరయ్యారు. పాఠశాల, కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భరోసా కేంద్రంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటివరకు భరోసా కేంద్రాన్ని 176 జంటలు ఆశ్రయించాయి. ఇందులో 52 జంటలను ఏకం చేసి వారి జీవితాల్లో వెలుగులను నింపారు.



పోలీసు కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సేవలు ఇలా..

హింసకు గురైన పిల్లలకు భరోసా ఇస్తున్నాయి. మహిళలకు అత్యవసర, నాన్-ఎమర్జెన్సీ, వైద్య, చట్టపరమైన, మానసిక, కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. ఈ కేంద్రంలో ఒక మహిళ ఇన్‌స్పెక్టర్, సైకాలజిస్టు, సపోర్టు పర్సన్, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, న్యాయవాది, రిసెప్షనిస్టు ఉంటారు. లైంగిక దాడులు, ఇతర వేధింపులకు గురైన పిల్లలు మానసిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో సేవల నిర్వహణ తీరు ఉంటుంది. ఇక్కడ పోలీసుస్టేషన్ తరహా వాతావరణం ఉండదు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వైద్య సేవలు నిర్వహిస్తారు. వేగంగా న్యాయ సేవలందేలా ఇక్కడ న్యాయవాది ఉంటారు.

కౌన్సెలింగ్‌తో ఒక్కటయ్యాం



మాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఒక పాప ఉంది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. చాలా సందర్భాల్లో విడిపోవాలనుకున్నాం. భార్యతో ఉన్న వివాదంపై ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వివరించాను. మా ఇద్దరిని భరోసా కేంద్రానికి పంపించారు. సుమంజలి మేడమ్ మూడుసార్లు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఒక్కటయ్యాం. – కౌన్సెలింగ్‌తో ఏకమైన రమ్య, సురేశ్ దంపతులు, మామడ

జీవితంలో వెలుగులు

మాకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబంలో ప్రతీరోజు గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లింది. మానసికంగా కుంగిపోయాను. ఒకసారి భరోసా కేంద్రాన్ని ఆశ్రయించాను. ఇద్దరికి మూడుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఏకమయ్యాం. ప్రతి వారం ఫోన్ చేస్తూ..మేము ఎలా ఉన్నామని కనుక్కుంటారు. భరోసా కేంద్రం ఆశ్రయించడంతో తమ జీవితంలో వెలుగులు నింపిన పోలీసులకు ధన్యవాదాలు. – లావణ్య, చరణ్ దంపతులు,సిర్గాపూర్

పోలీసులు అండగా ఉంటారు



బాధితులకు నిర్మల్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారు. బాధిత మహిళలు, యువతులు, బాలికలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. పాఠశాలల్లో పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు, పిల్లల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం. జిల్లా ప్రజలు ఏ సమయంలోనైన సంప్రదించవచ్చు. తాము కుటుంబానికి దూరంగా ఉంటున్నామని బాధ కన్నా, ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం అవుతున్నామన్న సంతోషం ఉంది. – జానకీ షర్మిల, ఎస్పీ

ఒక్కటయ్యేలా చేసి..



మాకు ఐదు నెలల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. ప్రతీరోజు గొడవలు జరిగేవి. భార్య పుట్టింటికి వెళ్లింది. ఎస్పీని కలిసి వివరించాను. భరోసా కేంద్రానికి పంపించారు. ఎస్సై సుమంజలి, సిబ్బంది శిరీష.. జీవితంలో ఎలా బతకాలి, భార్యతో ఇలా నడుచుకోవాలనే అంశంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. భార్యను మెప్పించి ఒక్కటయ్యేలా ఎస్పీ కృషిచేశారు. – ప్రవీణ, నరేశ్ దంపతులు

విద్యార్థుల కోసమే వర్సిటీ దత్తత

- ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దుకుందాం
- ఎస్పీ జానకీషర్మిల



విద్యార్థులతో ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్, వీసీ గోవర్ధన్

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వర్సిటీని దత్తత తీసుకుంటున్నామని ఎస్పీ జానకీషర్మిల అన్నారు.వర్సిటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్జీయూకేటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంపూర్ణ సహాయం, విద్యార్థుల సమగ్ర రక్షణ కోసం గొప్ప సంకల్పానికి పూనుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడంలో వారికి అవసరమైన మద్దతు, మార్గదర్శకత్వం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. వర్సిటీని ఎస్పీ దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగలు తాకట్టు.. ఖాతాలో జమకాని నగదు

- బెల్లంపల్లిలో ఘటన



బంగారం తాకట్టు పెట్టిన రశీదుపత్రం చూపిస్తున్న రాజేందర్

బెల్లంపల్లి: బంగారు నగలు తాకట్టు పెట్టిన వ్యక్తికి డబ్బులు బదిలీ కాకపోవడంతో కలకలం రేపింది. బెల్లంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన బాధితుడు కౌటారపు రాజేందర్ తెలిపిన వివరాలు.. అత్యవసరంగా డబ్బులు అవసరం ఉండి నాలుగు రోజుల క్రితం 14 తులాల బంగారు నగలను ముత్తూట్ మనీలో తాకట్టు పెట్టాను. రూ.7.35 లక్షలను నా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా వెంటనే జమ చేస్తామని సిబ్బంది తెలిపారు. నాలుగు రోజులు గడిచినా నగదు జమ కాలేదు. కేవలం రూ.1 మాత్రమే రావడంతో ఆందోళనకు గురయ్యాడు. శుక్రవారం ముత్తూట్ మనీ కార్యాలయానికి వచ్చి ఆరా తీశాడు. సిబ్బంది పొంతన లేకుండా సమాధానం చెప్పారని, ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య వల్ల డబ్బులు జమకాలేదని చెప్పినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు.

ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో సమస్యలు, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్య ఉన్న విద్యార్థులు తనకు నేరుగా ఫోన్ చేయాలన్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రణధీర్‌సాగిలతో భేటీ అయ్యారు. క్యాంపస్‌లో విద్యార్థుల ప్లేస్‌మెంట్స్ గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాగా, స్వాతి మృతిపట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే..ట్రిపుల్ ఐటీని సందర్శించారు.

ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రగతి చక్రం పురస్కారాలు పొందిన ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారికి ప్రగతి చక్రం పురస్కారాలు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సంస్థ ప్రగతికి పాటుపడుతున్న ఉద్యోగుల సేవలు మర్చిపోలేనివన్నారు. ఎప్పటికప్పుడు సంస్థ లాభాల బాట పట్టేలా వారంతా కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణికులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు తోడ్పాటును ప్రగతి చక్రం పురస్కారాల రూపంలో వారికి తిరిగి అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం. ప్రణీత్, డిపో మేనేజర్లు కల్పన, జనార్దన్ విశ్వనాథ్, హరిప్రసాద్, పీవో జిబ్లా, ఏవో శంకరయ్య, ఎంఎఫ్ శ్రీకర్, రాజేంద్ర, శివదాస్, పోతారెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్య



డుక్రే రాందాస్ (ఫైల్)

జైనూర్: పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు డుక్రే రాందాస్(44) తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాలేదని మనస్తాపం చెందాడు. గ్రామశివారులో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న భార్య శకుంతల, మరిది దేవిదాస్‌లు అక్కడికి చేరుకుని అతన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలానికి చెందిన వెంకటి (57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లో వెళ్తే..ఆదిలాబాద్‌లోని విద్యానగర్ గల హనుమాన్ ఆలయంలో వెంకటి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన సొరియాసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. చలి తీవ్రత పెరగడంతో బాధ తట్టుకోలేక గురువారం తిర్పెల్లి సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి బైండోవర్

జన్నారం: అక్రమంగా టేకు చెట్లు నరికివేతకు పాల్పడుతున్న మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజంను తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. కొన్ని రోజులుగా అక్రమ కలప రవాణాలో సహాయపడుతున్నాడని తేలడంతో బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

ప్రతీకార హత్య కుట్ర.. భగ్నం

- నలుగురు నిందితుల అరెస్టు
- నాలుగు పిస్తోళ్లు, 18 రౌండ్ల మ్యాగ్జిన్స్, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- నంద్యాలలో హత్య కోసం కాశీ నుంచి ఆయుధాల కొనుగోలు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీకార హత్యకు పన్నిన కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. నిషేధిత జనశక్తి దళం ఏర్పాటు ప్రక్రియను మొదట్లోనే తుంచేశారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన మైల దిలీప్, నంద్యాలకు చెందిన అవులపాటి హిమకాంత్‌రెడ్డి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ నుంచి నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజిన్స్, 18 లైవ్ రౌండ్స్ కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధి చాంద-టి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ గురువారం పట్టుకున్నారు. మరణాయుధాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని విచారించగా కుట్ర కోణం బయపడింది. ప్రధాన నిందితుడు నంద్యాలలోని సున్నిపెంటకు చెందిన వొట్టి వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేశాడు. ఇతడిపై రెండు టాడా కేసులు, వివిధ సంఘ విద్రోహ కేసులతోపాటు మూడు హత్య కేసులు, ఒక హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు ఉన్నాయి. సూర్యాపేటకు చెందిన తన మిత్రుడు హత్యకు గురికావడంతో ప్రతీకార చర్యగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో మళ్లీ జనశక్తి దళం ఏర్పాటుకు నిర్ణయించుకున్నాడు. మరణాయుధాల కొనుగోలుకు నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నలగంటి ప్రసన్నరాజు ఆర్థికసాయం అందించాడు. వెంకట్‌రెడ్డి తన అనుచరుడైన హిమకాంత్‌రెడ్డి, మైల దిలీప్, అతడి రెస్టారెంట్‌లో పనిచేసే బీహార్‌కు చెందిన కుక్ భైరవ్‌లు కలిసి కాశీకి వెళ్లారు. అక్కడి నుంచి బీహార్‌లోని ముంగీర్ రైల్వేస్టేషన్‌లో పిస్తోల్, బుల్లెట్లు తీసుకున్నారు. భైరవ్ కాశీలోనే ఉండిపోగా వారిద్దరు బయలుదేరారు. నంద్యాలకు వెళ్లే క్రమంలో ఆదిలాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ ఇద్దరిని విచారించడంతో వెంకట్‌రెడ్డి, ప్రసన్నరాజుల కుట్రను వెల్లడించారు. గురువారం రాత్రి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కుట్రకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేయగా మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజైన్స్, 18 లైవ్ రౌండ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు ఫణీందర్, కరుణాకర్‌రావు, సాయినాథ్, ఎస్సై ముజాయిద్ పాల్గొన్నారు.

బాసరకు పోటెత్తిన భక్తజనం

బాసర: కార్తిక శుక్రవారం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీసూర్యేశ్వర ఆలయంలో పూజలు చేశారు. సరస్వతి అమ్మవారి, పరమేశ్వరుని ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి, సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. తర్వాత చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిన్నారికి అక్షర శ్రీకారం చేయిస్తూ..



గోదావరి నది వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు..